కూటమితోనే అభివృద్ధి సాధ్యం

గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ బీటీ రహదారులు

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర - పాచిపెంట: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాలినడకన కూడా వెళ్లలేని గ్రామాలకు బీటీ రహదారి సౌకర్యం కూటమి ప్రభుత్వంతోనే సాకారమైందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలో గల మందేడవలస, కోదుల వలస గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ కోటి 25 లక్షలతో నిర్మించిన బీటీ రహదారిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ మాట్లాడుతూ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అను నిత్యం ప్రజలతోనే మమేకమై ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. ఒక పని కోసం వెళ్తే వీఆర్వో డబ్బులు అడిగాడని కేరింగ్ పంచాయతీకి చెందిన ఒక గిరిజన యువకుడు సభాముఖంగా మంత్రి దృష్టికి తేవడంతో స్పందించిన మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ విఆర్ఓ ఎవరో తెలుసుకొని వాస్తవమైతే విధుల నుంచి తప్పించాలని అక్కడే ఉన్న తహశీల్దార్ రవికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడెపు యుగంధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జిల్లా మత్స్య శాఖాధికారిగా సంతోష్ కుమార్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా మత్స్య శాఖాధికారిగా టి.సంతోష్ కుమార్ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను ఆయన ఛాంబరులో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీని అందించారు. జిల్లామత్స్య శాఖాధికారిగా ఇంతవరకు పనిచేసిన వి.తిరుపతయ్యను ఇటీవల ఏసీబీ అధికారులు పట్టుకున్న సంగతి తెలిసిందే. కొత్తగా జాయిన్ అయిన సంతోష్ కుమార్ జిల్లాలో మత్స్యకారులకు మేలు జరిగేలా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా మత్స్య శాఖాధికారిని కలెక్టర్ కోరారు.

ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాడతాం: సీపీఐ

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: ఇళ్ల స్థలాలను సాధించేంతవరకు పోరాడ తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. గుమ్మలక్ష్మీ పురంలో గతంలో నిర్వహించిన ఇళ్ల స్థలాలు ఎల్విన్ పేట రెసిడెన్షియల్ స్కూలు ప్రక్కన ఉన్న స్థలం, పోరాట స్థలాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగు బిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు ఇతర సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా తోట జీవన్న మాట్లాడుతూ గత సంవత్సరం గుమ్మలక్ష్మీపురం రెసిడెన్సియల్ స్కూల్ ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో సుమారు 350 మంది ఇల్లు లేని పేద గిరిజను లందరూ తుప్పలు, డొంకలు నరికి చదును చేశారన్నారు. ఈ సందర్భంగా పోరాటానికి నాయకత్వం వహించిన సీపీఐ నాయకత్వంపై ఫారెస్ట్ పోలీసులు స్థానిక వీఆర్వోలు మరి కొంతమంది నకిలీ గిరిజనులతో కేసు పెట్టడం జరిగిందన్నారు. సీపీఐ నాయకులు కురుపాం కోర్టుకు వాయిదాల నిమిత్తము వెళ్ళడం జరుగుతుందని, ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన సందర్భంగా కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరిని ఇళ్ల స్థలాల విషయమై అడిగామని అన్నారు. ఇళ్ల స్థలాలు సాధించేంతవరకు పోరాడ తామని అన్నారు. గతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మార్వో కార్యాలయానికి దరఖాస్తులు కూడా ఇచ్చినట్టు తెలిపారు. మరలా ఈనెల 9వ తేదీన వ్యక్తిగత అర్జీలు సమర్పిస్తామని అన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - బెలగాం: అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులపై, అగ్ని ప్రమాదాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు పార్వతీపురం అగ్నిమాపక కేంద్ర అధికారి జి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పార్వతీపురం జిల్లా ఆసుపత్రి సమీపంలోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం వద్ద అగ్నిమాపక సిబ్బంది హాస్పిటల్‌లో జరిగే వివిధ రకములైన అగ్నిప్రమాదాలు సంభవించే వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ చర్యలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించే విధంగా తన సిబ్బందితో ఫైర్ డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. సౌజన్య, డా. భరత్ చంద్ర, డా. ఉదయ్ కుమార్, డా. వై. లక్ష్మీనారాయణ, ఎల్ఎఫ్ ఎ.రమేష్, ఫైర్ మేన్ పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఈ నెల 4వ తేదీన 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బి.సి, బ్రాహ్మిణ్, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈ.బి.సి కాపు కార్పొరేషన్‌ల ద్వారా వివిధ రకాల యూనిట్లకు బ్యాంకు రుణములు, సబ్సిడీ మంజూరు నిమిత్తం పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో గల 15 సచివాలయాల నుండి 968 మంది లబ్ది దారులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీ లించి అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయు నిమిత్తం శుక్రవారం పార్వతిపురం పురపాలక సంఘ మెప్మా కార్యాలయం నందు బ్యాంక్ మేనేజర్స్‌తో ఇంటర్వ్యూలు జరపబడునని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కావున దరఖాస్తులు పెట్టుకున్న లబ్దిదారులు 3 సెట్స్ దరఖాస్తులు అనగా ఆన్లైన్లో పెట్టుకున్న దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, కుల ధ్రువ పత్రం జిరాక్స్, ఆదాయ ధ్రువ పత్రం జిరాక్స్, వాహనం గురించి పెట్టుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్స్ 3 సెట్స్, ఒరిజినల్ ఆధార్ రేషన్ కార్డు, కుల ధ్రువ పత్రం, ఆదాయ పత్రం జిరాక్స్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని పార్వతిపురం పురపాలక సంఘ మెప్మా కార్యాలయం నందు ఉదయం 10:00 గంటలకు ఇంటర్వ్యూ హాజరు కావాలని కోరారు.

ఎంపీడీఓగా రమేష్

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : పార్వతీపురం మండల పరిషత్ అధికారిగా జి. రమేష్‌ను (ఎఫ్ఎసి) ప్రభుత్వం నియమించింది. దీంతో బుధవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన రమేష్ ఇటీవల బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఏఓ జివి రమణమూర్తి సేవలు అందించారు. ఎఫ్ఎసిపై జి.రమేష్ బాబు విధుల్లో చేరడంతో మండల పరిషత్ పాలన గాడిలో పడటమే కాకుండా, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడం, అలాగే పారిశుధ్యం మెరుగుపరచడంలో మంచి ఫలితాలు సాధించవచ్చు. విధుల్లో చేరిన రమేష్ బాబును మండల పరిషత్ ఉద్యోగులు, సహా ఉద్యోగులు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

పొడి భూములలో విత్తన గుళికలు ఎంతో మేలు

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలం పనసభద్ర గ్రామంలో "విత్తన గుళికలు తయారీ దినోత్సవం" సందర్భంగా ఎస్‌పిఎంయూ మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ భాను ఆధ్వర్యంలో ఐదు రకాల విత్తన గుళికలు తయారు చేశారు. భాను మాట్లాడుతూ రబీ పంటలు తరువాత భూమిని ఖాళీగా వదిలేయకుండా ఏదో ఒక పంటని వేసుకోవాలని, వర్షాలు, నీరు లేని, పొడి భూములలో కూడా విత్తన గుళికలు తయారు చేసుకుని వేసుకోవచ్చాన్నారు. ఈ విత్తన గుళికలు వేసుకోవడం వల్ల తేమను తట్టుకుని, పక్షులు, చీమలు తినకుండా ఆరు నెలల వరకు భద్రంగా ఉంటాయన్నారు. తొలకరి వర్షాలు పడే ముందు భూసారం కోసం పిఎండీఎస్ నవధాన్య విత్తనాలు చల్లుకోవాలని అన్నారు. వరి పంట వేసేముందు ఎకరానికి ముప్పై రకాల విత్తనాలు పన్నెండు కేజీలు చొప్పున వేసుకుని దమ్ములో కలియదున్నాల న్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌వి జి.చంద్రశేఖర్, ఎన్ఎఫ్ఏ సిహెచ్. శారద, మోడల్ మేకర్ గద్దె ధనబాబు, యూనిట్ ఇన్‌చార్జి ఉర్లక నాగార్జున, ఫార్మర్ సైంటిస్ట్ గుళివిందల అశోక్ ఐసిఆర్పీలు ఆర్.సుందరరావు, డి.వెంకట రావు, ఎస్.పాపారావు, ఎమ్.చిన్నపుదొర, కె.అప్పలరాజు రైతులు పాల్గొన్నారు.

సహజ ప్రసవాలే తల్లీబిడ్డలకు ఆరోగ్యం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: ప్రతి గర్భిణీ సహజ ప్రసవాలపై అవగాహన కలిగి ఉండాలని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రం స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ పూర్ణ చంద్రిక తెలిపారు. బుదవారం స్థానిక వైద్యాధికారి టి.కె సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్‌కు వెళ్లాలి తప్పితే వీలైనంత వరకు సహజ ప్రసవాలు జరిగేటట్లు చూడాలని తెలిపారు. అపుడే ప్రతి తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండగలరని ఆమె తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ పరిధిలో శ్రీ రామా కళామందిర్ వీధిలోగల శ్రీ కోటదుర్గా ఫిజియోథెరపీ క్లినిక్ ఆవరణలో డాక్టర్ అప్పికొండ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ ఐకాన్ విశాఖపట్నం జనరల్ ఫిజీషియన్, ప్రఖ్యాత గుండె వైద్య నిపుణులు డాక్టర్ దావాల వాసుబాబు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరికి క్షుణ్ణంగా పరిశీలించి తగిన సూచనలు సలహాలు తెలిపారు. వైద్య శిబిరంలో సుమారుగా 200 మంది వరకు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్ దావాలా వాసు బాబు, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ సూర్యనారాయణ, ఐకాన్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు: ఎంపీడీఓ

విశాలాంధ్ర - కురుపాం: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి కురుపాం మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన 125 అప్లికేషన్స్ ఆన్లైన్ చేసుకున్నారని వాళ్ళందరికీ గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ బ్యాంకుల మేనేజర్లతో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తెలిపారు. కావున లబ్ధిదారులందరూ మండల పరిషత్ కార్యాలయంలో రుణాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రావలసిందిగా తెలియజేసారు.

అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన అవసరం

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గల హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదంలో చిక్కుకొన్న, గాయపడిన వారిని సురక్షిత ప్రదేశానికి తరలించే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమములో ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - కురుపాం: అక్రమంగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న పదిలీటర్ల నాటుసారాతో వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చినమేరంగికి చెందిన వెలగాడ ప్రకాశరావు హోండా ద్విచక్ర వాహనంపై నాటుసారా క్యాన్‌తో అక్రమంగా తరలిస్తున్న సమయంలో సిబ్బందితో దాడి చేసి నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసులకు ఉద్యోగాలు లేనట్టేనా...?

ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

విశాలాంధ్ర - పాడేరు: జిల్లాలో మహిళ శిశు సంక్షేమ సాధికారత నోటిపికేషన్‌లో ఆదివాసులకు ఉద్యోగాలు లేనట్టేనా...? అంటే ఈ నోటిఫికేషన్ చూస్తే అవుననే చెప్పక తప్పటం లేదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. షెడ్యూల్ ఆదివాసీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో మహిళ, శిశు సంక్షేమ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆదివాసులకు ఒక్క పోస్టు కూడా కేటాయించక పోవడం తీవ్ర అన్యాయమని గతంలో ఇప్పుడు తీసిన నోటిఫికేషన్లు చూస్తుంటే ఇకపై ఆదివాసి ప్రాంతంలో కూడా ఆదివాసులకు ఎటువంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేనట్టే కనిపిస్తుందన్నారు. ఈ నోటిఫికేషన్ తక్షణమే రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా మహిళ, శిశు సంక్షేమ సాధికారత కార్యాలయం అల్లూరి సీతారామరాజు జిల్లా మిషన్ వాత్సల్యనందు మంజూరైన పోస్టులకు గిరిజనేతరులతో భర్తీకి నోటిపికేషన్ జారీ చేశారని, ఆదివాసులకు ఒక్క పోస్ట్ కూడా కేటాయించకుండా అల్లూరి జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు.

రంపులు ఘాట్ వద్ద లారీ బోల్తా

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలో రంపుల ఘాట్ వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడింది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనులకు రంపులు ఘాట్‌లో ఏపీ 26వై 60 87 నెంబర్ గల ఆయిల్ ట్యాంకర్ లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎదురుగా ఏ వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. హుటా హుటిన మెరుగైన వైద్యం కోసం కేడీపేట ఆసుపత్రికి నేషనల్ హైవే వాహనాల్లో తరలించడం జరిగింది.

కాఫీకిచ్చిన ప్రాధాన్యత జీడి పిక్కలకు ఇవ్వరా...!

విశాలాంధ్ర - కొయ్యూరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పండించే కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో ఎంత డిమాండ్ ఉందో జీడిపిక్కలకు కూడా అంతే డిమాండ్ ఉన్నప్పటికీ వాటిని పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రజా ప్రతినిధులు అధికారులు మీన వేషాలు లెక్కిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ధన్యం రాజు కనకరాజు ఆరో పించారు. బుధవారం స్థానిక విలేక రులతో మాట్లాడుతూ జీడిపిక్కలు పండిన సమయంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నా రన్నారు. పిక్కలు పంట అయిపోయిన అనంతరం తామే కొనుగోలు చేస్తామని ఐటీడీఏ అధికారులు ప్రగల్బాలు పలకడం తప్ప ఏనాడు కొనుగోలు చేసిన పాపాన పోలేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ ప్రాంతంలో అధికంగా పండే జీడిపిక్కలపై దృష్టిసారించి రైతాంగానికి నష్టం లేకుండా ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

శ్రీరామనవమి ముహూర్తపు రాట

విశాలాంధ్ర - సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ఏనుగుబైలు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల వారి కళ్యాణం నిమిత్తం బుధవారం ఆలయ అర్చకుడు కొర్రా రాము ఆధ్వర్యంలో స్థానిక భక్తులు ముహూర్తపు రాటను వేశారు. 6వ తేదీ ఆదివారం నుండి నవరాత్రులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సద్గురు ధర్మపత్ని గౌరగలి లక్ష్మి, అల్లూరి సీతారామ రాజు జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ గొర్లె గణేశ్వరరాజు, భక్తులు నడిగొట్ల నాగభూషణం, బురిడీ సరస్వతిరావు, మండల వనవాసి కార్యకర్త ఆడారి సుహాషిణి పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పిఎంఈజిపి నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవాలని ఆ పథకం నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. లంబసింగి ట్రైబల్ ఫార్మర్స్ ఆర్గానిక్ ప్రొడ్యూసర్ కంపెనీ కార్యాలయ భవన్‌లో ఆ కంపెనీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి వేముల పూడి గ్రామానికి చెందిన స్వరాజ్య సంఘ్ ఖాది గ్రామీణ పరిశ్రమల కమిషన్ రమణతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలకు చెందిన నిరు ద్యోగుల ఉపాధి కల్పనకు భారత ప్రభు త్వం పీఎంఆర్‌వై ఆర్ఇజిపి పథకాలను విలీనం చేయడం ద్వారా 2008 - 09 సంవత్సరంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పి ఎం ఈ జి పి) పేరిట నూతన క్రెడిట్ లింక్ బ్యాంక్ ఎండెడ్ రాయితీ పథకాన్ని (ఎమ్ ఎస్ ఎం ఈ) మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన నోడల్ ఏజెన్సీ ద్వారా దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేసేందుకు జాతీయ స్థాయిలో నోడల్ ఏజెన్సీగా ఖాదీ గ్రామీణ పరి శ్రమల కమిషన్ (కెవిఐసి) వ్యవహరిస్తుం దన్నారు. ఈ పథకం ద్వారా తయారీ రంగానికి 50 లక్షలు సేవా రంగానికి 20 లక్షల రూపాయలు రాయితీ రుణం అందించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ దీనికి అర్హులన్నారు. ఈ పథకంలో రుణాలు పొందాలనుకునేవారు ఆన్లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు https://www.kviconline.gov.in/pmegpeportal చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.వి.ఐ.బి.జె.ఐ సురేష్, లంబసింగి ఆర్గానిక్ ప్రోడక్ట్ అధ్యక్షుడు ఉల్లి నూకరాజు, పెదబరడ మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ, ఎస్.వీరేంద్ర కుమార్, శ్రీనివాసరావు (గాజుల శ్రీను), రాహుల్, రాజా, సరోజ (రూతు), ఇందిర, సామాజి, చిన్నారి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి సన్మానం

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలో గల కెజీబీవి విద్యాలయంలో 8వ తరగతి విద్యానభ్యసిస్తున్న విద్యార్థిని వన్నెపూరి మంజుప్రియ 2024 సంవత్సరం నవంబర్ నెల 21వ తేదీన స్టేట్ లెవెల్‌లో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా బుధవారం మంజు ప్రియని స్థానిక ప్రిన్సిపల్ ఎన్.అనిత, సిబ్బంది కలిసి దుశ్శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడా రంగంలో విద్యార్థులు రాణించాలని కోరారు. తమ పాఠశాల నుంచి పాడేరులో జరిగిన పోటీల్లో తంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కేజీబీవీ విద్యార్థిని ఈనెల 7వ తేదీన జాతీయస్థాయి పోటీల్లో మణిపూర్లో పాల్గొంటుందని ఆమె తెలిపారు. మరిన్ని పతకాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గన్నేరుపుట్టులో పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలో గల మఠం పంచాయతీ గన్నెరు పుట్టు గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించామని వైద్యాధికారి కె.చరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సమీపించడంతో పశువులకు అనేక రకాల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గుర్తించి గిరిజన రైతులు ముందస్తుగా పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు. పశు మాంసాలు తినే వారు ఉడికించిన మాంసం మాత్రమే తినాలని ఆయన కోరారు. ఈ పశువుల ఆరోగ్య వైద్యశిబిరం ద్వారా 48 పశువులకు వైద్య సేవలు అందించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల ఏహెచ్‌ఏలు కామేశ్వరరావు, అనిల్, పరుశు రాం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ అప్పలరాజు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల పరిషత్ అధ్యక్షునిగా లొంబరి అప్పలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదివాసి ప్రభావిత పదం చర్చ్ చింతపల్లి ఫాస్టర్ ఈనక్ ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాడేరు టిడిపి ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ మండలంలో సేవ మిత్రలను వేగంగా నియమించాలని సూచించారు. మాజీ మంత్రి మణికుమారి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకం అని అన్నారు. బహుశా రాబోయే ఎన్నికలు మూడంచెల విధానంలో జరగవచ్చని అలాగే జరిగితే అప్పల రాజు చివరి ఎంపీపీగా చూడాలని ఆమె అన్నారు. మూడంచెల విధానం లో ఎన్నికలు జరిగితే ఎంపిటిసి స్థానాలు కనుమరుగు అవుతుందని అన్నారు. ఇలాగే జరిగితే మండలంలో టీడీపీని కొనగించే బాధ్యత కార్యకర్తలదే అని ఆమె అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ సభ్యులు కీళ్లుడు రమేష్ నాయుడు, ఎపి ట్రైకర్ సభ్యుడు కూడా కృష్ణారావు, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సోమేలి చిట్టి బాబు, జి.మాడుగుల ఎంపీటీసీ 2 ఈశ్వరరావు, బొర్రా విజయ రాణి, కృష్ణ మూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు వంతల కొండల రావు, కార్యదర్శి కీముడు కల్యాణం, నాయకులు నాగబ్బాయి, మత్యారాజు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల సర్టిఫికెట్లు పరిశీలన

విశాలాంధ్ర - కొయ్యూరు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో అంగన్వాడీ కార్యకర్తలుగా విధులు నిర్వహిస్తున్న వారందరి సర్టిఫికెట్లు పరిశీలన చేయడం జరిగిందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కె.విజయ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి విజయ కుమారి మాట్లాడుతూ మండలంలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తల యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి విద్యార్హత గల సర్టిఫికెట్లను కూడా పరిశీలించడం జరిగిందన్నారు. అనంతరం కార్యకర్తలకు బాల సంజీవిని యాప్ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

రేషన్ కార్డు లబ్ధిదారులకి ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలో రేషన్ కార్డుదారుల ందరూ ఈకే వైసీ తప్పనిసరిగా చేయించు కోవాలని తహశీల్దార్ టి.రామకృష్ణ వెల్లడించారు. బుధవారం రింతాడలో తహశీల్దార్ కార్డుదారులకు దగ్గరుండి ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31లోగా కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని లేకపోతే బియ్యం పంపిణీ నిలిచిపోయే అవకాశం ఉందని తెలియజేశారు. ఇక గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు ఇంటింటికి వెళ్లి ఈకేవైసీ చేస్తున్నారన్నారు. రేషన్ షాపులు, మీసేవ, ఆధార్ కేంద్రాల్లోనూ ఈకేవైసీని నమోదు చేయించు కోవచ్చని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఒకటవ తరగతి నుండి 5వ తరగతి లోపు పిల్లలకు ఈకేవైసీ పెండింగ్ ఉందని వారికి ఆధార్ కేంద్రాల్లో అప్‌డేట్ చేస్తే సరిపోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సురకత్తి కృష్ణారావు, ఎండియు కంకిపాటి నారాయణ, రేషన్ డీలర్ ఖఘుపతి పాల్గొన్నారు.

స్థాపితం:1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
రంపచోడవరం, వై.రామవరం, గంగవరం, అడ్డతీగల, ఎటపాక.
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్య రెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

విశాలాంధ్ర
పేజీ : 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
గురువారం 3, ఏప్రిల్ 2025

ఎలక్ట్రికల్ షాపులో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పాత బజార్‌లో గల శివ సంతోష్ ఎలక్ట్రికల్ షాప్ నందు బుధవారం మధ్యాహ్నం 12.గం సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ పరికరాలు టీవీలు సుమారు 5 లక్షల రూపాయల విలువ గల వస్తువులు కాలి బూడిదయ్యాని షాప్ యజమాని శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. షాపును ప్రారంభించి సుమారు ఐదు నెలల కావస్తుందని ఇంతలో ఇలా నష్టం కలగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

జీవనోపాధి మెరుగుపడాలి: ఏపీఎం

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని సంఘ బలోపేతానికి కృషి చేయాలని వెలుగు ఏపీఎం సన్నిబాబు అన్నారు. శిక్షణలో భాగంగా రెండో రోజున బుధవారం మహిళా సంఘాల సభ్యులు వారి వారి జీవన ప్రమాణాలను, జీవనోపాధి మెరుగుపరుచుకునేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. వార్షిక రుణ ప్రణాళికపై శిక్షణ 2025-26 జీవన ఉపాధి కొరకు యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చి వారిలో ఆదాయం వచ్చే విధంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో సిసిలతో పాటు వీఓఏలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకు ఎన్టీఆర్ సామాజిక పెన్షన్

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: జీవిత భాగస్వామిని కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న ప్రతి ఒక్క అర్హులైన మహిళకు ప్రభుత్వం ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఎంతో మంచి ఫలితాలు ఇస్తుందని దీని మూలంగా ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు లేక జీవనం సాగించగలరని మండలానికి చెందిన టీడీపీ నాయకులు చంటి అన్నారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర సూచనల మేరకు బుధవారం జరిగిన ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డోకిశీల సచివాలయంలో పాల్గొని అర్హులైన మహిళలకు అందించారు. ఇటీవల పంచాయతీ పరిధిలో కొందరు హఠాన్మరణం పొందారని మరికొందరు అనారోగ్యంతో చనిపోగా ఆ కుటుంబం రోడ్డున పడిందన్నారు. అయితే ప్రభుత్వం పెన్షన్ జారీలో నిర్లక్ష్యం చేయకుండా ఇంటి ఇల్లాలికి వితంతు పెన్షన్ మంజూరు చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలాపు కొండలరావు, చంటి, శ్రీధరపు రాజు, మాజీ సర్పంచ్ వెంపటాపు సాంబమూర్తి, నాగేశ్వరరావు, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాలకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి గుర్తించాలి

విశాలాంధ్ర - బెలగాం: 2022లో ఏపిలో కొత్త జిల్లాల ఏర్పాటు చేసినా నేటికీ జిల్లాలను కేంద్రం స్థాయిలో గుర్తింపునకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదని వెంటనే గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి కొత్త జిల్లాలకు గుర్తింపు ఇస్తేనే కేంద్రం నుండి నిధులు వస్తాయని లేదంటే అప్పటివరకు పాత జిల్లాలకు వచ్చే నిధులే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. గెజిట్ నోటిఫికేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కొత్త జిల్లాల అభివృద్ధి, ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం, కబ్జాలు కాకుండా కాపాడాలని రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. మన్యం జిల్లా ఏర్పాటు చేసి మూడేళ్లయినా ఎక్కడా అభివృద్ధి లేదని విమర్శించారు.

వాణిజ్య సముదాయ నిర్మాణానికి ప్రతిపాదనలు

జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి అశోక్ కుమార్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక మార్కెట్ యార్డులో వాణిజ్య సముదాయ నిర్మాణానికి కొత్త ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపామని జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి యల్.అశోక్ కుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మార్కెట్ యార్డులో దుకాణాల సముదాయం నిర్మిస్తే ఆదాయం వస్తుందనే ఆలోచనతో రూ.90 లక్షల అంచనాతో నాలుగుసార్లు టెండర్లను పిలిచామన్నారు. కాని గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం మరలా అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కొత్త కార్యాలయ భవన నిర్మాణానికి రూ.50 లక్షలతో టెండర్ పిలిచినప్పటికీ, గుత్తేదారుడు తమ పనులను ప్రారంభించలేదన్నారు. గతేడాది బడ్జెట్ రద్దు కాబడినందున, మరలా కొత్త ప్రతిపాదనలను ఆమోదం కొరకు ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. ఉపాధి బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకెఎమ్‌యూ) ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా చేసి ఎంపీడీఓకి వినతి అందజేశారు. ఈ సందర్భంగా గరుగుబిల్లి సూరయ్య మాట్లాడుతూ జిల్లాలో గత ఏడు వారాలుగా చేసిన ఉపాధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలందరూ ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిపిన పాదయాత్ర సందర్భంగా అనేక మంది వ్యవసాయ కార్మికులు తన గోడును వెల్లబుచ్చుకున్నారని అన్నారు. ఇప్పటికే వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఆధ్వర్యంలో పెండింగ్ ఉపాధి బిల్లు చెల్లించాలని అనేకమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయుకులు పూవల ప్రసాదు పత్తిక మోహన్, రమణ మూర్తి సింగన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు వేలం

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట వారపు సంతలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు నిర్వహించిన ఆశీల పాటలో కాసులు గోవిందరావు అనే వ్యక్తి రూ.1.31 లక్షలతో కైవసం చేసుకొన్నారని స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన సంత ఆశీల పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శనివారం వారపు సంతలో దూకాణాల వద్ద వ్యాపారుల వద్ద ఆశీలు వసూలు చేసి సంత పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ పాటకు దర్మరాజు, విశ్వనాథ్, కాసులు గోవిందరావు, నాగరాజులు పాల్గొని పోటీ పడ్డారని చివరకు కాసుల గోవిందరావు అనే వ్యక్తి కైవసం చేసుకొన్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పరమేశ్వరరావు, సెక్రటరి సత్యనా రాయణ, వార్డు మెంబర్ వెంకట్, పెసా కమిటీ సభ్యులు గోవిందు, గణేష్, వీర్రాజులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ జిల్లాగా పార్వతీపురం: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో సాధ్యమైనంత వరకు ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ జిల్లా దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 4,800 ఎకరాల వరకు పైనాపిల్ సాగు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 250 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరగడం పట్ల కలెక్టర్ ఆరా తీశారు. ఈ ఏడాది కనీసం వేయి ఎకరాల్లో పైనాపిల్ సాగు జరగాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఎక్కువగా జరుగుతుందని, కావున సేంద్రియ పంటల రైతులను ప్రోత్సహించాలని అన్నారు. నిమ్మగడ్డికి మంచి గిరాకీ ఉందని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రోత్సహించాలన్నారు. రెండు వేల ఎకరాల్లో నిమ్మగడ్డిని సాగు చేసేందుకు అవకాశం ఉందని, ప్రస్తుతం 833 ఎకరాల్లో సాగు జరుగుతుందని, దాన్ని మరింత పెంపుదల చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 2 వేల హెక్టర్లలో ఆయిల్ పామ్ సాగు జరుగుతుందని, అది మరింత పెరగాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా జీడి, పసుపు, ఇతర అంతర్ పంటలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రాథమిక రంగం ద్వారానే జిల్లాలో అధిక శాతం వృద్ధి సాధించేందుకు ఆస్కారం ఉందని, కావున సంబంధిత అధికారులందరూ ఆయా శాఖల ద్వారా సాధించగల వృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేసుకొని వచ్చే వారంలోగా నివేదికలను అందించాల న్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపక యూనిట్లను ప్రోత్సహించి జీవనోపాధులు మరింత పెంచాలని అన్నారు. సెరికల్చర్ క్లస్టర్ లు ఏర్పాటుచేయాలని, దానికి మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సెరికల్చర్ క్లస్టర్ లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశాలు పరిశీలించాలని, తద్వారా ప్రజల్లో ప్రాచుర్యం పొందగలరని చెప్పారు. ఫారం పాండ్స్ ఏర్పాటువలన వ్యవసాయ, మత్స్య సంపద సాగుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, కావున రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. ఇప్పటివరకు 9వేల ఫారం పాండ్స్ ప్రారంభించబడి కొన్ని పూర్తయ్యాయని, ఈ ఏడాది 50 వేల ఫారం పాండ్స్ లక్ష్యం కావాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. 90 గ్రామాల్లో 120 చెక్ డ్యాములు ప్రారంభించడం జరిగిందని, రానున్న రెండు మాసాల్లో అవి పూర్తికావాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి శ్యామల, టి. సంతోష్ కుమార్, ఎ.వి.సాల్మన్ రాజు, డా.ఎస్.మన్మథ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సుధారాణి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఎల్డిఎం ఎన్.విజయ్ స్వరూప్, కేవికె శాస్త్రవేత్త డా. శ్రీనివాసరాజు, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, డీసీఓ పి.శ్రీరామ మూర్తి, ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు 99.34 శాతం పూర్తి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో 6,246 రెవిన్యూ సదస్సులకు గాను 6,205 సదస్సులను చేపట్టి 99.34 శాతం మేర పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అడిషనల్ సీసీఎల్ఎకు వివరించారు. రెవిన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, రెగ్యులరైజేషన్, నీటి పన్ను తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో అడిషనల్ సీసీఎల్ఎ మరియు సెక్రటరీ డా. ఎన్.ప్రభాకరరెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా 41 రెవిన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉందని, త్వరలో వాటిని నిర్వహించి శత శాతం పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇప్పటివరకు 29,778 అర్జీలు రాగా, వాటిలో 29,365 పరిష్కరించడం జరిగిందని అన్నారు. మిగిలిన 413 అర్జీలు పరిష్కారదశలో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఈవీడియో సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఎమ్మెల్యేకు సామల సింహాచలం వినతి

విశాలాంధ్ర - బెలగాం : మండల విద్యాశాఖ అధికారులు -1లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు ఎంఈఓ -1 అసోసియేషన్ ఏపి రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం కోరారు. బుధవారం ఎమ్మెల్యేను తన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ముందుగా ఇటీవల శాసనసభ్యులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ చూపిన ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించి అభినందించినట్లు సామల తెలిపారు. అనంతరం సమస్యలను వివరిస్తూ ఎంఈఓ -1 లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం వలన చాలా ఇబ్బందిగా ఉందని, హైస్కూల్ హెచ్ఎంలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ ఉండగా మండల విద్యాశాఖలో దాదాపు 150 నుండి 200 మంది టీచర్లకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం చాలా బాధాకరమని తమకు ఎంపిడిఓలు డిడిఓలుగా ఉండటం వలన వారు అనేక పనులు ఎంఈఓలకు అప్పచెబుతున్నారని ఇందువలన విద్యా శాఖ కార్యకలాపాలకు, విధులకు ఆటంకం కలుగుతుందన్నారు. పాఠశాలల పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించే ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంఈఓ -1 లకు వాహన సౌకర్యం కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. నూతన ఎంఈఓ ఆఫీస్ భవనాలను నిర్మించాలని, అంతేకాకుండా జిల్లా సెక్టోరియల్ అధికారులుగా, డిప్యూటీ విద్యాశాఖ అధికారులుగా ఎంఈవో -1లకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

పార్కింగ్ చేస్తే జరిమానాలా....?

వాహనాల కోసం జనరల్ పార్కింగ్ ఏర్పాటు చేయండి

రైల్వే పోలీస్ అధికారులను కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం (బెలగాం) రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు పార్కు చేస్తే వాహనాలకు గొలుసులు తాళాలు, ఫైన్‌లు, కేసులు వేస్తారా అని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. బుధవారం పార్టీ ఇన్‌చార్జి బత్తిన మోహనరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఓబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు రైల్వే సబ్ ఇన్ స్పెక్టర్ ఇగ్నేష్ కుల్లును కలిసి రైల్వేస్టేషన్ వద్ద వాహనాల పార్కింగ్ ప్రజల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌కు వచ్చినవారు తమ వాహనాలను తాత్కాలికంగా కొద్ది సమయం స్టేషన్ ముందు ఉంచితే ఇటీవల ఆయా వాహనాలకు గొలుసులతో తాళాలు వేసి, ఫైన్లు వేసి, ఆపై కేసులు పెడుతున్నట్లు పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. రైల్వే స్టేషన్ ముందు జనరల్ పార్కింగ్ లేకపోవడంతో కొన్ని తరాలుగా వస్తున్న అలవాటు ప్రకారం రైల్వే స్టేషన్ ముందు పార్కు చేస్తున్నారని కొద్దిసేపు పనుల నిమిత్తం వచ్చినవారు పెయిడ్ పార్కింగ్లో తమ వాహనాలను ఉంచలేరు కాబట్టి జనరల్ పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలన్నారు. జనరల్ పార్కింగ్ స్థలాన్ని కేటాయించకుండా, స్టేషన్ ముందు పార్కు చేసిన వాహనాలకు ఇలా తాళాలు, ఫైన్లు, కేసులు పెట్టడం సరికాదన్నారు. తక్షణమే జనరల్ పార్కింగ్ స్థలాన్ని చూపించాలన్నారు.

అలాగే రైల్వే స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని కంట్రోల్ చేయాలని ఒడిషా నుండి నిబంధనలకు విరుద్ధంగా సరైన అనుమతులు బిల్లులు లేని సరుకులు దిగుమతి అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గంజాయి లాంటి మాదకద్రవ్యం రవాణా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయని వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రయాణీకుల సౌకర్యార్థం రైల్వే పని చేయలే తప్ప వారిని ఇబ్బంది పెట్టకూడదన్నారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన సబ్ ఇన్ స్పెక్టర్ ఇగ్నేష్ కుల్లు మాట్లాడుతూ జనరల్ పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తామని, స్టేషన్ ముందు వాహనాలు పార్కు చేస్తే ఫైన్ తప్పదని బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు.

చింతపల్లి వారపు సంతలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

సంత షెడ్లకు దుకాణాలు మార్పు

పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు

విశాలాంధ్ర - చింతపల్లి: వారపు సంతలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీసులు, రెవెన్యూ శాఖలు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా బుధవారం చింతపల్లి వారపు సంతలో రహదారి కిరువైపులా చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఏ ఎస్ నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు సీఐఎం వినోద్ బాబు, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో రహదారులకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయకుండా వారపు సంత షెడ్లలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు చిరు వ్యాపారులకు అవకాశం కల్పించారు. తరతరాలుగా మన్య ప్రాంతంలో ప్రతీ రోజు ఏదో ఒక గ్రామంలో వారపు సంత నిర్వహించడం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆ వారపు సంతలలో అవసరమైన నిత్యవసర సరుకులు, కూరగాయలు ఇతర వస్తువులు కొనుగోలు చేసుకోవడం పరిపాటిగా జరుగుతున్న ప్రక్రియ. ఈ మేరకు చింతపల్లి మండలంలో సోమవారం నాడు ఏజెన్సీ అన్నవరం, మంగళవారం లోతుగెడ్డ జంక్షన్, బుధవారం చింతపల్లి, గురువారం లంబసింగి, శుక్రవారం పెదవలస, శనివారం సప్పర్ల, ఆదివారం కోరుకొండ, జర్రెల, దారకొండ, సీలేరు ఇలా ప్రతీ రోజు ఆయా గ్రామాలలో వారపు సంతలు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతీ బుధవారం మండల కేంద్రమైనా చింతపల్లి లో వారపు సంత జరుగుతుంది. చింతపల్లి లో జరిగే వారపు సంతకు మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులతో పాటు ఏజెన్సీలోని చిరు వ్యాపారులు వివిధ వాహనాలలో అధిక సంఖ్యలో వచ్చి వ్యాపారాలు సాగిస్తూ ఉంటారు.అదే క్రమంలో వీటిని కొనుగోలు చేసేందుకు మండలం లోనే కాకుండా, అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు సంతకు వచ్చి, వారికి కావలసిన వివిధ రకాల వస్తువులు తో పాటు కూరగాయలు తదితర వాటిని కొనుగోలు చేసి వారి వారి గ్రామాలకు తీసుకొని వెళుతుంటారు.ఈ నేపథ్యంలో వారపుసంత జనాలతో కిక్కిరిసిపోతోంది. అదే క్రమంలో చిరు వ్యాపారులు కూడా రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు వేసి, వ్యాపార లావాదేవీలు సాగించుతుంటారు..దీంతో వచ్చే పోయే వాహనాలతో రహదారి పై రాకపోకలకు అంతరాయం కలిగి, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీనిని అధిగమించేందుకు పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ట్రాఫిక్ సమస్యలు రాకుండా స్థానిక ఎస్ ఐ.వెంకటేశ్వరరావుతోపాటు రెవెన్యూ శాఖ అధికారులు స్థానిక సంత జరిగే ప్రాంతంను సందర్శించి, వ్యాపారులకు పలు సూచనలు ఇచ్చారు. వ్యాపార దుకాణాలను రహదారి పై తొలగించి, స్థానిక డెయిరీ ఫారం క్వార్టర్స్ సమీపం లో ఉన్న నాబార్డ్ నిధులతో ఏర్పాటు చేసిన సంత మార్కెట్ షెడ్లను వ్యాపారులు ఉపయోగించు కోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారపు సంత రహదారిపై కాకుండా సంత షెడ్ ల కొరకై నిర్మించిన ప్రాంతంలో వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో చింతపల్లి వారపు సంతకు ఎటువంటి ట్రాఫిక్ సమస్య లేకుండా రోజంతా పోలీసులు పహారా కాశారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - బెలగాం: ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 2వ తేదీన ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవంగా జరుపుకుంటారని, ఈ సమస్యపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశమని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి సమీపంలోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్ - డిఈఐసి) వైద్యులు తెలిపారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆటిస్టిక్ పిల్లలు సాధారణ పిల్లల కంటే కొంచెం భిన్నంగా ఉంటారని కాబట్టి వారితో వ్యవహరించే విధానం కూడా భిన్నంగా ఉంటుందని తెలిపారు. ఆటిజం సంకేతాలు జీవితంలో చాలా చిన్న వయస్సులోనే కనిపిస్తాయని కొన్నిసార్లు బాల్యంలోనే కనిపిస్తాయని మరికొన్నిసార్లు బాల్యం చివరి వరకు వేచి ఉంటాయని చాలా మందిలో ఈ రుగ్మత ఉపశమనం లేకుండా క్రమంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం పిడియాట్రిక్ వైద్య నిపుణులు డా. భరత్ చంద్ర, దంత వైద్యులు డా. సౌజన్య, ఫిజియోథెరపిస్ట్ డా. ఎద్దు లక్ష్మీనారాయణ, సైకాలజిస్ట్ డా. ఉదయ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు

నాడీ జ్యోతిష్యులు మురపాక

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండలంలోని సంగవలస పంచాయితీ పిట్లవలస గ్రామంలో స్వయంభూగా వెలిసినటువంటి శ్రీ ఉమా నీలకంఠ స్వామి ఆలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి మూడు రోజులు పాటు మహాకుంభాభిషేకంతో పాటు పరివార దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పట్టణానికి చెందిన ప్రముఖ నాడీ జ్యోతిష్యులు శ్రీ సర్వవిద్య మంగళ దేవి పీఠం వ్యవస్థాపకులు మురపాక కాళిదాసు శర్మ యాజి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించి, కుంభాభిషేకానికి తీర్మానం చేశారు. అంతేకాకుండా స్వయంభూగా వెలసినటువంటి ఈ ఆలయం గతంలో శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణ పనులు, ప్రారంభోత్సవం నిర్వహించారు. ప్రస్తుతం ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ప్రహరీ నిర్మాణం, ముఖద్వారం పనులను కమిటీ సభ్యులతో కలిసి చూసి హర్షం వ్యక్తం చేశారు. దాతల సహాయ సహకారాలతో పిట్లవలస ఆలయానికి పూర్వ వైభవం వచ్చిందని, ఎంతో చరిత్ర కలిగిన స్వయంభూగా వెలిసినటువంటి ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని పేర్కొన్నారు. ఈ నెలలో జరిగే స్వామివారి మహా కుంభాభిషేకానికి పెద్ద సంఖ్యలో భక్తులు గ్రామస్తులు తరలిరావాలని కోరారు.

4న పోలవరం మొదటి ఫేజ్ గ్రామసభలు

విశాలాంధ్ర - కూనవరం: ఈనెల 4వ తేదీన కూనవరం మండలంలోని పోలవరం మొదటి ఫేజ్ 1లో ముంపునకు గురవుతున్న 32 గ్రామాలలో భాగంగా కూనవరం మండలంలోని శబరి కొత్త గూడెం, పేదర్కూరు, టేకు బాక, టేకులబోరు, వి అర్ పురం మండలంలోని రాజు పేట, కన్నయిగూడెం, కొప్పలి, సొమ్ములగూడెం, ధర్మ తాళ్ళ గూడెం శబరి, రాయి గూడెం గ్రామాలలో భూ సేకరణ, ఆర్ ఆర్ గ్రామ సభలు నిర్వాసితుల గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. ఈ గ్రామ సభలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హుల, అనర్హుల వివరాలు వెల్లడించడం జరుగుతుందని చెప్పారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో వెంటనే అదే గ్రామ సభలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారికి అర్జీ సమర్పించవచ్చు అన్నారు.

బిజెపి జిల్లా కార్యదర్శిగా అనీల్

విశాలాంధ్ర - కురుపాం: భారతీయ జనతా పార్టీ మన్యం జిల్లా కార్యదర్శిగా కురుపాం గ్రామానికి చెందిన బోటు అనిల్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర బిజెపి ఉత్తర్వులు జారీచేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ సందర్భంగా బోటు అనిల్ కుమార్ బిజెపి పార్టీ జిల్లా, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ ఆశయాలకు సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని తెలిపారు. జిల్లా కార్యవర్గంలో కార్యదర్శిగా నియమించిన అదిష్టానానికి, జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - సీతానగరం: పార్వతీపురం ఈఈ ఆదేశాలసారం గురువారం ఉదయం 8 గంటలు నుండి 1గంట వరకు లక్ష్మీపురం ఫీడర్ మీద ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని విద్యుత్ శాఖ ఏఈ జగన్మోహనరావు తెలిపారు. చెట్లకొమ్మలు, లైన్ల నిర్వహణజరుగునని ఆయన చెప్పారు. దీనివలన లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస, బొమ్మికపాడు, ఏగోటీవలస, బుడ్డిపేట గ్రామాలకి విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు బిసి కార్పొరేషన్ రుణాల లబ్దిదారుల ఎంపిక

విశాలాంధ్ర - సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ కు సంబంధించిన లబ్దిదారుల ఎంపిక గురువారం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు తెలిపారు. నిర్ణీత కాలంలో ఆన్లైన్ ద్వారా లోన్ల అప్లికేషన్లు పెట్టిన వారితో బ్యాంకు మేనేజర్లుతో, ఆఫీస్ స్టాఫ్ కలసి ఇంటర్వ్యూలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్వ్యూకు విచ్చేసే అభ్యర్థులందరూ అన్ని ధ్రువపత్రములతో హాజరు కావాలని కోరారు.

పంచాయతీల్లో చలివేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర - సీతానగరం: జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీలలో వేసవి కారణంగా దాహార్తిని తీర్చేందుకు ప్రజలు తిరుగాడే రహదారిల వద్ద, వేచివుండే కూడల్ల దగ్గర చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. అన్ని పంచాయతీల్లో తప్పనిసరిగా వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రామకృష్ణ దంపతులకు సన్మానం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా రామవరం పంచాయతీ రామవరం గ్రామానికి చెందిన రామకృష్ణ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా ఆదివారం విజయవాడలో గిరిజన సాంప్రదాయ కొమ్ము నృత్యం డాన్స్ కు రాష్ట్రస్థాయి "ఉగాది" పురస్కార అవార్డు అందుకున్నారు. ఈ మేరకు రామవరం పంచాయతీ రామవరం గ్రామంలో గ్రామస్తుల సమక్షంలో ఉగాది పురస్కార అవార్డు గ్రహీత ఉయికా రామకృష్ణ దంపతులను మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బురక కన్నా రావు, నియోజక వర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్‌రావు, గ్రామ శాఖ అధ్యక్షులు గొర్రె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా బురక కన్నారావు మాట్లాడుతూ ఆదివాసి సంప్రదాయ నృత్యం విన్యాసాలను మీకు వచ్చే అవకాశాలను బట్టి అనేక రాష్ట్రాలలో కనువిప్పు కలిగే విధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.